సాక్షి
ఒడిశా

బుధవారం । 26 । మార్చి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,31,504లు, బంగారం 1 గ్రాము 550 మిల్లీగ్రాములు, వెండి 5 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



నాపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదు

తనపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని, కావాలనే బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ రాయగడ జిల్లా అధ్యక్షుడు గోపి ఆనంద్ స్పష్టం చేశారు.

- IIలో▸



అక్రమ కలప స్వాధీనం

మల్కన్‌గిరి జిల్లాలోని కోరుకొండ సమితి ఎంవీ 23 గ్రామంలో ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను జిల్లా అటవీశాఖ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు.

- IIలో▸

న్యూస్‌రీల్

చికిత్స పొందుతూ కళాకారిణి సంతోషిణి మృతి



జయపురం: తన నటనా కౌశల్యంతో ప్రజలను అలరించిన బాల కళాకారిణి సంతోషిణి తరాశియ(13) చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. జయపురం మున్సిపాలిటీలోని జయనగర్ పాయిక సాహికి చెందిన దుర్గా ప్రసాద్ తరాశియ ఏకైక కుమార్తె సంతోషిణి. ఈమె పాఠశాల ఉత్సవాలు, పట్టణంలో జరిగే వివిధ ఉత్సవ వేదికలపైన ఎన్నో నృత్య ప్రదర్శనలు ఇస్తూ ఆకట్టుకుంది. జయపురంలో వివిధ సంస్థలు నిర్మించిన 15 చిన్న సినిమాల్లో నటించి ప్రశంసలు పొందింది. అయితే ఇటీవల ఆమె అస్వస్థతకు గురయ్యింది. దీంతో ఆమెకు జయపురం, కొరాపుట్ ఆస్పత్రుల్లో చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ ఆమె మంగళవారం మృతి చెందింది. దీంతో జయపురంలో విషాదచాయలు అలముకున్నాయి.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు



సమాధాన్ సంచిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ తదితరులు

జయపురం: క్రమశిక్షణతో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. సమితిలోని ఫస్ట్రల్‌బెడ గ్రామంలో ఉన్న విజ్ఞాన ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవాన్ని పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు ప్రకాశ్ కుమార్ నాయిక్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు గుణాత్మక విద్యనభ్యసించాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సంస్కారం అలవర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఔషధ మొక్కల వనాన్ని ప్రారంభించారు. పాఠశాల వార్షిక ముఖపత్రం 'సమాధాన్'ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జయపురం న్యాయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ నిరంజన్ మిశ్ర, పాఠశాల ప్రిన్సిపాల్ సర్వేశ్వర ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష



కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్షించేందుకు ఇద్దరు సభ్యుల కేంద్ర బృందం జయపురంలో మంగళవారం పర్యటించింది. వీరు టంకువ పంచాయతీ, జయపురం పట్టణంలో కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం జయపురం మున్సిపల్ సభాగృహంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్ష చేపట్టారు. పట్టణ ప్రధాన మార్గం, రాజానగర్, ప్రధాన ట్రాఫిక్ కూడలి ప్రాంతాల్లో పీఎం ఎస్‌బీఎస్ నిధి నుంచి రుణాలు తీసుకున్న లబ్ధిదారులను కలిసి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం అవాస్ యోజన లబ్ధిదారులతో ముచ్చటించారు. పథకాలను ప్రజలంతా సక్రమంగా ఉపయోగించుకోవాలని సూచించారు. వారితో పాటు కలెక్టర్ వి.కీర్తి వాసన్, జయపురం సబ్ కలెక్టర్ ఎ.శొశ్యారెడ్డి, జయపురం బీడీవో శక్తి మహాపాత్రో, జిల్లా సివిల్ సప్లయ్ విభాగ అధికారి సూర్యకాంత బెహర తదితరులు పాల్గొన్నారు.

విద్యాభ్యాసాలకు ఆహ్వానాలు



ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు సీఎం మోహన్ చరణ్ మాఝి పేరిట ఆహ్వాన పత్రికలను కలెక్టర్ బిజయ కుమార్‌దాస్ పర్లాకిమిడిలో మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో డీఈవో డా.మాయాధర్ సాహు, బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారులు పాల్గొన్నారు.

నిరసనల ఘాటు.. సస్పెన్షన్ వేటు..!



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ సభ్యులు

- 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల సస్పెండ్
- వారం రోజుల పాటు కొనసాగనున్న ఆదేశాలు
- క్రమశిక్షణ ఉల్లంఘించడంపై చర్యలు: స్పీకర్ సురమా పాఢీ

భువనేశ్వర్:

శాసనసభలో అనుచిత ప్రవర్తన ఆరోపణ కింద కాంగ్రెస్ సభ్యులు సస్పెన్షన్ వేటుకు గురయ్యారు. స్పీకర్ సురమా పాఢి ఆదేశాల మేరకు 12 మంది కాంగ్రెస్ సభ్యులను సభా కార్యకలాపాల నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు మంగళవారం ప్రకటించారు. ఈ ఆదేశాలు వారం రోజుల పాటు నిరవధికంగా అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. సభలో బడ్జెటు సమావేశాల కార్యకలాపాల సమయంలో పదేపదే అంతరాయం ఏర్పరచి క్రమశిక్షణను ఉల్లంఘించడంతో ఈ చర్య అనివార్యమైనట్లు స్పీకర్ పేర్కొన్నారు. అధికార పక్షం చీఫ్ విప్ ప్రతిపాదన మేరకు చర్యలు తీసుకున్నారు.

కాంగ్రెస్ సభ్యుల నిరసన

సస్పెన్షన్ చర్యకు నిరసనగా శాసనసభ ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ సభ్యులు నిరసన తెలిపారు. ఘంటానాథం, తాళాల మోత, వేణుగానం తదితర వాద్యాలతో తమ నిరసనలు వ్యక్తం చేశారు. శాసనసభలో 14 మంది కాంగ్రెస్ సభ్యులు ఉన్నారు. వీరిలో 12 మంది సభ్యులు సస్పెన్షన్‌కు గురయ్యారు. వారిలో కాంగ్రెస్ శాసన సభా నాయకుడు రామచంద్ర కదం, అశోక్ కుమార్ దాస్, సత్యజిత్ గొమాంగో, పవిత్ర సంవుట, సాగర్ చరణ్ దాస్, నీల మాధబ్ హికాకా, ప్రఫుల్ల చంద్ర ప్రధాన్, సోఫియా ఫిరదౌస్, డాక్టర్ సి.ఎస్.రాజెన్ ఎక్కా, మంగు ఖిల్లా, దాశరథి గొమాంగో, కద్రక అప్పల స్వామి ఉన్నారు. కాగా మరో ఇద్దరు ఎమ్మెల్యేలు తారా ప్రసాద్ బాహిణీపతి మరియు రమేష్ జెనాలు ఇప్పటికే సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే.

మహిళల భద్రతపై ఆందోళన

రాష్ట్రంలో మహిళల భద్రతపై కాంగ్రెస్ సభ్యులు అసెంబ్లీలో గత కొన్ని రోజులుగా ఆందోళన తెలుపుతున్నారు. మహిళల భద్రత స్థితిగతుల దృష్ట్యా సభా కమిటీ ఏర్పాటు చేసి సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. సభలో బడ్జెట్ సమావేశాలు ఆరంభం నుంచి ఇదే కొనసాగుతోంది. తమ డిమాండ్ మేరకు మహిళల భద్రతపై సభా కమిటీ ఏర్పాటు చేయనంతవరకు నిరసన నిరవధికంగా కొనసాగిస్తామని బాహాటంగా కాంగ్రెస్ సభ్యులు ప్రకటించారు. ఈ ప్రకటన జారీ చేసిన స్వల్ప వ్యవధిలో సభ నుంచి 12 మంది సభ్యులను సస్పెండ్ చేసినట్లు స్పీకర్ నిర్ణయం ప్రకటించడం రాజకీయ శిబిరాల్లో తీవ్ర సంచలనం రేపుతోంది.

సస్పెన్షన్ దురదృష్టకరం

సభలో కాంగ్రెస్ సభ్యుల సస్పెన్షన్ దురదృష్టకరమని కాంగ్రెస్ ఎమ్మెల్యే దాశరథి గొమాంగో అన్నారు. స్పీకర్‌పై తాము సముచిత గౌరవ మర్యాదలు ప్రదర్శిస్తున్నామని పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం సభను సమర్థవంతంగా నడపలేకపోతోందని ఆరోపించారు. మహిళల భద్రత అంశంపై సభా కమిటీ ఏర్పాటు డిమాండ్‌కు కట్టుబడి ఉన్నామని, రానున్న రోజుల్లో ఆందోళనను మరింత తీవ్రతరం చేయనున్నట్లు స్పష్టం చేశారు. కాగా మహిళల భద్రతపై కాంగ్రెస్ ఎమ్మెల్యేల డిమాండ్ ప్రకారం అధికార పార్టీ అంగీకరించి సభా కమిటీని ఏర్పాటు చేసి ఉండాల్సిందని బీజేడీ ఎమ్మెల్యే డాక్టర్ అరుణ్ సాహూ ఏకీభవించారు. ప్రభుత్వ అసమర్థత వల్లే ఇదంతా జరిగిందని విచారం వ్యక్తం చేశారు. 12 మంది ఎమ్మెల్యేల్ని సస్పెండ్ చేయడం రాష్ట్ర ప్రభుత్వ తొందరపాటు చర్యగా పేర్కొన్నారు. గత 10 రోజులుగా సభలో కొనసాగుతున్న పరిస్థితులను సమర్థవంతంగా పరిష్కరించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. అయితే శాసన సభలో సమావేశాలు పురస్కరించుకుని ప్రభుత్వం రోజుకు సగటున రూ.70 లక్షలు వెచ్చిస్తోందని అధికార పక్షం భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే బాబు సింగ్ తెలిపారు. ప్రతిపక్షాలు కీలకమైన చర్చలను అడ్డుకొని అమూల్యమైన సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు.

విస్తృతంగా చర్చ

ఒక వైపు శాసనసభ సమావేశాల్లో ప్రతిపక్ష సభ్యుల నిరంతర అంతరాయం, మరోవైపు అధికార పక్షం ఏకపక్షంగా 12 మంది కాంగ్రెస్ సభ్యులను సస్పెండ్ చేయడంపై మేధావుల వర్గంలో చర్చలు జోరందుకున్నాయి. సమావేశాలు పురస్కరించుకుని ప్రజల అవసరాలు, సమస్యలపై నిర్మాణాత్మక సంభాషణలు, ప్రశ్నోత్తరాలు, చర్చలు కొనసాగించే పరిస్థితులు దాదాపు కనుమరుగైపోవడంపై సర్వత్రా విచారం వ్యక్తమవుతోంది.

బీజేడీ శాంతియుత నిరసన

మహిళల భద్రత అంశంపై ఇప్పటికే కాంగ్రెస్ ఎమ్మెల్యేల నిరసన తారస్థాయికి చేరుకుంది. అయితే ఇదే శీర్షికతో ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ హుందాగా నిరసన తెలిపింది. మంగళవారం సమావేశ హాలు ప్రధాన ప్రవేశ మార్గం ఆవరణలో ప్లకార్డులతో బైఠాయించి శాంతియుతంగా నిరసన ప్రదర్శించింది. అదేవిధంగా సభలో తాజా స్థితిగతులపై విపక్ష బిజూ జనతా దళ్ సభ్యురాలు ప్రమీల మల్లిక్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. కాంగ్రెస్ సభ్యులపై తీసుకున్న చర్య ఆమోదయోగ్యం కాదని ఆమె తేటతెల్లం చేశారు. ఈ పరిస్థితిపై సీఎం మోహన్‌చరణ్ స్పందించాలని కోరారు. 12 మంది సభ్యులను సస్పెండ్ చేసే ముందు విపక్షాలతో చర్చించాల్సిందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

రైల్వేసేవా పురస్కారాలు ప్రదానం



సరుకు రవాణా నిర్వహణ రంగంలో సేవా పురస్కారం అందుకుంటున్న సిబ్బంది



పురస్కారం అందుకుంటున్న ప్రజా సంబంధాల శాఖ సిబ్బంది

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ఖుర్దారోడ్ మండలం 69వ రైల్వే సేవా పురస్కారాల ప్రదానోత్సవం స్థానిక రెటాంగ్ కాలనీ కల్యాణ మండంలో మంగళవారం జరిగింది. మండల సీనియర్ కార్మిక అధికారి ఎస్‌డీపీవో ఆర్.ఎస్.ఎ.పరిడా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల రైల్వే అధికారి డీఆర్‌ఎం హెచ్.ఎస్.బాజ్వా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇతర అతిథులుగా తూర్పు కోస్తా రైల్వే మహిళా సంక్షేమ సంఘం మండల శాఖ అధ్యక్షురాలు గురు సిమ్రాన్ కౌర్, అదనపు మండల రైల్వే అధికారి ఏడీఆర్‌ఎం (ఆపరేషన్స్) పి.కె.బెహెరా, ఏడీఆర్‌ఎం (ఇంఫ్రా) సుబ్రజ్యోతి మండల్ పాల్గొన్నారు. వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలు అందజేసిన 56 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు.

పశువులకు ఆధునిక వైద్యం అవసరం



శిక్షణా తరగతుల ప్రారంభోత్సవానికి హాజరైన అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్

- కలెక్టర్ బిజయకుమార్ దాస్

పర్లాకిమిడి: రోడ్లపై ప్లాస్టిక్ పదార్థాలను తినడం వలన పశువులు రోగాల బారిన పడుతున్నాయని, అందువలన వాటికి ఆధునిక వైద్యం అవసరమని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. స్థానిక సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో పశువులకు ఆధునిక వైద్య విధాన శిక్షణ అస్కాడ్- 2025 తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పశువైద్యశాఖ అధికారి రమాకాంత రోణా మాట్లాడుతూ.. పశు వైద్యులు గ్రామాల్లో పర్యటించి చికిత్సలు అందజేయాల్సిన అవసరం ఉందన్నారు. పాడి రైతులు అధిక పాల దిగుబడులు సాధించేలా సూచనలు అందించాలని సూచించారు. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఆస్కాడ్ పశువైద్యుల ట్రైనింగ్ ప్రోగ్రాంలో తొమ్మిది జిల్లాల నుంచి పశువైద్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ కళాశాల డీన్ ఆర్.కె.స్వయిని, ట్రైనింగ్ కో–ఆర్డినేటర్ గిరీష్ మహంతి, సెంచూరియన్ వర్సిటీ డీన్ డా.అనితా పాత్రో, అగ్రికల్చర్ స్కూల్ డీన్ డాక్టర్ ఎస్పీ నందా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్

పర్లాకిమిడి: స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఈ–ఆఫీస్ శిక్షణ తరగతులు కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. డిజిటల్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో క్రియాశీల, సరళీకృత, పారదర్శకత విధానంపై అవగాహనకు ఉద్యోగులు శిక్షణలో పాల్గొనాలని కోరారు. భువనేశ్వర్ నుంచి వచ్చిన శిక్షకులు దీపక్ కుమార్ మల్లిక్, కవితారాణి రౌతో ఈ–ఆఫీస్ పని విధానాన్ని తెలియజేశారు. ఈ తరగతులు ఈనెల 28 వరకు జరుగుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఏడీఎం రాజేంద్ర మింజ్, ఐటీడీఏ పీవో అంశుమాన్ మహాపాత్రో, ఎన్ఐసీ జిల్లా అధికారి టి.బాలకృష్ణ మూర్తి, ఎన్ఐసీ డీఐవో రాజా ఆనంద్, సీఎంజీఐ కో–ఆర్డినేటర్ ప్రశాంత కుమార్ సాహు పాల్గొన్నారు.

జగన్నాథుని సన్నిధిలో జస్టిస్ హరీష్ టండన్



జగన్నాథుడిని దర్శించుకున్న జస్టిస్ హరీష్ టండన్

భువనేశ్వర్: పూరీ జగన్నాథ ఆలయాన్ని జస్టిస్ హరీష్ టండన్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజార్చనల్లో పాల్గొన్నారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఒక రోజు ముందుగా శ్రీ జగన్నాథుడిని దర్శించుకున్నారు. బుధవారం రాష్ట్ర హైకోర్టు 35వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ టండన్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. హైకోర్టు ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం



ఆస్పత్రిలో మృతదేహాలు

రాయగడ: వివాహేతర సంబంధంతో ఒక అవివాహిత, వివాహితుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సదరు పోలీస్‌స్టేషన్ పరిధి రైతుల కాలనీ ఏడోలైన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రైతుల కాలనీ 7వ లైన్‌లో నివసిస్తున్న కోడూరు రమేష్ అనే వివాహితుడు, తన ఇంటి పక్కనే నివసిస్తున్న ఒక అవివాహితతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం వీరిద్దరూ ఒకే గదిలో ఉండడం గమనించిన ఇరుగుపొరుగు వారు విషయాన్ని బయటపెట్టారు. దీంతో గది లోపలే ఇద్దరూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న ఇరువురి కుటుంబ సభ్యులు వారిద్దరినీ చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ వారు మృతి చెందారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్ వర్మ



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు

జయపురం: జయపురం సదర్ పోలీసులు పెద్ద ఎత్తున గంజాయి పట్టుకున్నట్లు కొరాపుట్ ఎస్పీ రోహిత్ వర్మ తెలిపారు. స్థానిక సబ్ డివిజనల్ పోలీసు అధికారి కార్యాలయంలో మంగళవారం నిర్వహించబడిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సదర్ పోలీసులు జయపురం సమితి కంజాయి మాలిగుడ ప్రాంతంలో సోమవారం పెట్రోలింగ్ జరుపుతున్న సమయంలో 4 కార్లు అతివేగంగా బొయిపరిగుడ వైపు నుంచి వస్తున్నాయి. దీంతో అనుమానం వచ్చిన పెట్రోలింగ్ సిబ్బంది వాటిని ఆపాలని ప్రయత్నించారు. అయితే వారు కార్లు ఆపకుండా పెట్రోలింగ్ జరుపుతున్న పోలీసు సిబ్బందిపై తుపాకీతో కాల్పులు జరిపి పరారయ్యేందుకు ప్రయత్నించారని వెల్లడించారు. దీంతో వెంటనే పోలీసులు ఆ కార్లను వెంబడించి వారిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 4 కార్లలో ఉన్నటువంటి 8 మందిని అరెస్టు చేశారు. అలాగే కార్లలో తీసుకెళ్తున్న 340.400 కేజీల గంజాయి, రెండు కంట్రీ మేడ్ పిస్టల్స్, 5 సుబాఎమ్యూనేషన్స్, 10 సెల్‌ఫోన్లను సీజ్ చేశామన్నారు. అరెస్టైనవారిలో ఉమ్మిరి గ్రామానికి చెందిన రంజిత్ బాగ్, కార్తీక్ బాగ్, కర్ణ హరిజన్, రబీంద్ర బారిక్‌లు ఉన్నారు. వీరిపై గతంలో అనేక కేసులు నమోదై ఉన్నాయి. అలాగే మిగతావారు గౌతమ్ బాగ్, రవీంద్ర సామల్, సోను మంగూరియ, రాహుల్ కుమార్‌లుగా పేర్కొన్నారు. సమావేశంలో జయపురం ఎస్డీపీవో కావ్యపే పార్థసారథి తదితరులు ఉన్నారు.

మల్కన్‌గిరిలో శుభాశర్మ పర్యటన



విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చిస్తున్న శుభాశర్మ



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి:

జిల్లాలో మహిళా, శిశు అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శుభాశర్మ మంగళవారం పర్యటించారు. ఆమెకు కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అధికారులు, తల్లిదండ్రులు తదితరులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. గిరిజన పాఠశాలల్లో మౌలిక వసతులు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలో బాలికల భద్రతాపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే చిత్రకొండ సమితిలో పర్యటించి అక్కడి మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉగాది పురస్కారాలకు ఎంపిక

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లి ఆదిత్యానగర్ కాలనీలోని మణిపాత్రుని క్రియేటివ్ అకాడమీ (ఎంసీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 30న విశ్వావసు నామ ఉగాది పురస్కారాలను వివిధ రంగాలలో ప్రముఖులకు అందజేస్తున్నట్లు నిర్వాహకులు భాగ్యలక్ష్మి, నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బాలరంజని సంస్థ ఆధ్వర్యంలో వివిధ నైపుణ్యాలలో ప్రతిభ సాధించిన బాలలకు పురస్కారాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.వాండ్రంగి కొండలరావు (సాహిత్యరత్న), బద్రి కూర్మారావు (సేవారత్న), కంటు మురళీగోవింద్ (నాట్యరత్న), ఎర్రపాటి అప్పారావు (నటరత్న), నేరెళ్ల సత్యనారాయణ (గానరత్న), ఆచింటు లక్ష్మణరావు (వాయిద్యరత్న), వడగ సుబ్రహ్మణ్యం (హరికథారత్న), ఇంజరాపు మోహన్‌రావు (వైద్యరత్న), యాపార శ్రీనివాస్ (యువ సేవారత్న), ఎలినాటి ధరణి (బాలరత్న-కోలాటం), బి.సన్నిహిత్ (బాలరత్న-చిత్రలేఖనం), ఎం.లిప్సి శ్రీవల్లి జయదేవ్‌కుమార్ (కూచిపూడి, సంగీతం), శ్రీకాకుళం చిట్టి (బాలరత్న- ఇన్‌స్టాగామ్), బిన్నాడ దీక్షిత్ (శ్లోకపఠనం)లకు పురస్కారాలు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. అదే విధంగా, నగరంలోని సాహితీ చైతన్య కిరణాలు అధ్యక్షుడు ఉమాకవికి నెల్లూరుకు చెందిన ప్రాచీన తెలుగు విశిష్ట ధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఉగాది పురస్కారానికి ఎంపికైనట్లు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలు రేపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 27న ఉదయం ఉదయం 10నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్నాయి. అదే రోజు సాయంత్రం ఫలితాలు వెల్లడిస్తారు. ఏడాదికోసారి జరిగే ఈ ఎన్నికలకు సంబంధించి కార్యదర్శి, కోశాధికారి, క్రీడా, లైబ్రరీ కార్యదర్శుల పోస్టులకు ఒకే నామినేషన్ పడటంతో ఏకగ్రీవమయ్యాయి. కార్యదర్శిగా మోటూరి భవానీప్రసాద్, కోశాధికారిగా కొమర శంకరరావు, లైబ్రరీ కార్యదర్శిగా కొమ్ము రమణమూర్తి, క్రీడా కార్యదర్శిగా త్రిపురాన వరప్రసాదరావు ఎన్నికయ్యారు. మిగిలిన పదవులకు ఎన్నిక జరగనుంది.

ఉప సర్పంచ్‌పై చర్యలకు వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నరసన్నపేట పంచాయతీ పాలక మండలి సభ్యులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలంతో గెలిచి మరో పార్టీలో చేరి ఇప్పుడు మేజర్ పంచాయతీ పరిపాలనకు ఆటంకంగా మారిన నరసన్నపేట మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబుపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ పాలకవర్గ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి సాయి ప్రత్యూషకు ఫిర్యాదు చేశారు. ఉపసర్పంచ్‌పై పాలకవర్గంలోని 16 మంది సభ్యుల సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మాన నోటీసును అందజేశారు. ఆర్డీఓను కలిసిన వారిలో మాజీ ఉపసర్పంచ్, ప్రస్తుత వార్డు మెంబర్ కోరాడ చంద్రభూషణ గుప్తా, మెంబర్లు వార్డు రఘుపాత్రుని శ్రీధర్, బంకుపల్లి శర్మ, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళీధర్, జెడ్పీటీసీ చింతు రామారావు, మాజీ చైర్మన్ రాజాపు అప్పన్న, ఎంపీటీసీ బగ్గు రమణయ్య, నేతింటి రాజేశ్వరరావు, మాజీ డైరెక్టర్ బబ్బోది ఈశ్వరరావు, సతివాడ రామినాయుడు, తోట భార్గవ్ తదితరులు ఉన్నారు.

14 కేజీల గంజాయితో ముగ్గురు అరెస్టు

కాశీబుగ్గ: ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడి నుంచి తమిళనాడుకు గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని పట్టుకున్నట్లు పలాస జీఆర్పీ ఎస్ఐ షరీఫ్ తెలిపారు. తమిళనాడుకు చెందిన త్యాగు, విఘ్నేష్, అజిత్‌లు మంగళవారం పర్లాఖిమిడి నుంచి గంజాయి తెప్పించుకుని పలాసలో తమిళనాడు వెళ్లే రైలు కోసం వేచి ఉండగా సీసీ కెమెరాల్లో వారి కదలికలపై అనుమానం వచ్చిన జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు వారిని తణిఖీ చేశారు. వారి వద్ద రూ.74 వేలు విలువైన 14.8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో మరో ముగ్గురు అరెస్టు

ఆమదాలవలస: పట్టణంలోని కంద్రపేట వీధి వెనుక శ్మశానవాటిక గత ఏడాది అక్టోబర్ 27న ఐదు కిలోల గంజాయిని అప్పటి ఎస్ఐ కె.వెంకటేష్ నేతృత్వంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో ఏడుగురిలో నలుగురు పట్టుబడగా ముగ్గురు పరారయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శ్రీకాకుళం నానుబాలవీధికి చెందిన తమ్మినేని సాయి, శ్రీకాకుళం దమ్మలవీధికి చెందిన మైపల్లి రాంబాబు, ఆమదాలవలస వాంబే కాలనీకి చెందిన పాలకొండ చిన్న నిందితులుగా గుర్తించి అరెస్టు చేసినట్లు ఆమదాలవలస ఎస్ఐ ఎస్.బాలరాజు తెలిపారు. నిందితులను ఆమదాలవలస సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

బీఎస్ఎఫ్ సేవా కార్యక్రమాలు



వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



దివ్యాంగ బాలికకు వీల్‌చైర్ అందజేత



క్రికెట్ కిట్‌లతో యువకులు



మహిళలకు దుస్తులు అందజేస్తున్న జవాన్లు



చిన్నారులకు స్టడీ టేబుల్స్ అందజేస్తున్న జవాన్లు

మల్కన్‌గిరి జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా జోడాంబో పంచాయతీలో 177వ బెటాలియన్‌కు చెందిన బీఎస్ఎఫ్ జవాన్లు సేవా కార్యక్రమాలు మంగళవారం చేపట్టారు. దీనిలో భాగంగా వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి మందులు అందజేశారు. యువతకు క్రికెట్ కిట్లు, చిన్నారులకు స్టడీ టేబుల్స్ అందజేశారు. అలాగే మహిళలకు నిత్యావసర సరుకులు, దుస్తులు అందించారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ జవాన్లు పాల్గొన్నారు. – మల్కన్‌గిరి

• అక్రమ కలప స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కలప

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి ఎంవీ 23 గ్రామంలో ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను జిల్లా అటవీశాఖ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలోని శ్రీనివాస్ బేపారి అనే వ్యక్తి ఇంట్లో కలప ఉన్నట్లు అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో అటవీ అధికారుల బృందం మంగళవారం తెల్లవారుజామున ఆ ఇంటిపై దాడి చేశారు. వీరి రాకతో విషయం తెలుసుకున్న శ్రీనివాస్ పరారయ్యాడు. దీంతో నిల్వ ఉంచిన రూ.లక్షలు విలువ జేసే కలప స్వాధీనం చేసుకున్నారు. దాడిలో రేంజర్ రమేష్ చంద్ర రౌత్, ఫారెస్టర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శాసనసభ నేటికి వాయిదా

భువనేశ్వర్: శాసనసభలో కాంగ్రెస్ సభ్యులను సస్పెండ్ చేసిన అనంతరం సభా కార్యక్రమాలను బుధవారం నాటికి నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో రాత్రంతా నిరసన ప్రదర్శనలు చేపడతామని కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేశారు. దీనిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం హత్య చేయబడిందన్నారు. ఇదో కళంకిత చరిత్రగా మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి నిర్ణయం మేరకు నిరవధికంగా పోరాడుతామని హెచ్చరించారు. అలాగే సభ్యుల సస్పెన్షన్‌పై 27న అసెంబ్లీ ముట్టడిస్తామని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ తెలియజేశారు.

పోక్సో చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి భాస్కరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిన్నారులను లైంగిక వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం ఒకటో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి పి.భాస్కరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీ 4వ లైన్‌లో ట్రైబల్ హాస్టల్‌ల్లో పిల్లలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం-పోక్సోపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల పట్ల అనేక నేరాలు జరుగుతున్నాయని చెప్పారు. అశ్లీల చిత్రాలు చూపించడం నేరమని తెలిపారు. కార్యక్రమంలో అడ్వకేట్ జి.ఇందిరాప్రసాద్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఏ.రాజారావు, ఆర్.అప్పలస్వామి, జి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో అటెండర్ మృతి

- శ్రీకాకుళం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఘటన
- కల్లాడలో విషాదఛాయలు

అరసవల్లి: ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా ఎస్ఈ కార్యాలయం నీటి కోసం మోటార్ స్విచ్ వేయడానికి వెళ్లిన కార్యాలయ అటెండర్ మల్లారెడ్డి ఆనందరావు(47) విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. మంగళవారం ఉదయం 10.30 గంటల సమయంలో అందరూ విధుల్లో ఉండగా ఈదుర్ఘటన జరగడంతో ఇటు ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులు, అటు జిల్లా పరిషత్ పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు నిర్ఘాంతపోయారు. సమాచారం తెలిసిన వెంటనే జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రాజా ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఉదయం మోటార్ వేయడానికి వెళ్లి ఇంకా రాలేదని మరో అటెండర్ శార్వాణి వెళ్లినప్పటికే అచేతనంగా ఆనందరావు పడి ఉండటంతో మిగిలిన సిబ్బందికి సమాచారాన్ని అందించింది. 108 వాహనం సిబ్బంది వచ్చేసరికే మృతి చెందినట్లు వారు ధృవీకరించారు.వన్‌టౌన్ ఎస్సై హరికృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. స్థానిక దేశెల్ల వీధిలో నివాసముంటున్న ఆనందరావు స్వస్థలం నందిగాం మండలం కల్లాడ గ్రామం. భార్య దుర్గ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆనందరావు మృతి పట్ల జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, జెడ్పీ చైర్‌పర్సన్ కార్యాలయ సీసీ అప్పన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రంగప్రసాద్, డీఈ లలితకుమారి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థి దుర్మరణం



మణికుమార్(ఫైల్)

బూర్జ: మండలంలోని చీడివలస గ్రామానికి చెందిన బూరి మణికుమార్ (18) విద్యుత్ షాక్‌కు గురై మంగళవారం మృతి చెందాడు. మామయ్య నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఇంటి గోడలను నీటితో తడుపుతూ ఇనుప నిచ్చెన తీస్తుండగా విద్యుత్ వైర్లు తగలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసేసరికే మృతిచెందాడు. మణికుమార్‌కు తల్లిదండ్రులు దుర్గారావు, కేసరి, సోదరి ఉన్నారు. చేతికందిన కుమారుడు విద్యుత్ షాక్‌కు గురికావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



మెళియాపుట్టి మీదుగా ఇసుకను తీసుకెళ్తున్న ఒడిశా ట్రాక్టర్లు

- ఒడిశాకు రాత్రివేళల్లో తరలించుకుపోతున్న వైనం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

మెళియాపుట్టి: కూటమి ప్రభుత్వం ప్రటించిన ఉచిత ఇసుక విధానం కొంతమందికి కాసులు కురిపిస్తోంది. పగటి పూట అధికారులు దాడులు చేస్తారని భావించి రాత్రివేళల్లో ఒడిశా వంటి ప్రాంతాలకు దర్జాగా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. హిరమండలం, ఎల్ఎన్‌పేట, కొత్తూరు మండలాల నుంచి ఇసుకను పాతపట్నం మీదుగా ఆల్ ఆంధ్రా రహదారిలో మెళియాపుట్టి గ్రామ వీధుల్లో నుంచి ఒడిశాకు అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. గతంలో ఇసుక అక్రమ రవాణాపై మీడియాలో కథనాలు రావడంతో రెవెన్యూ అధికారులు రూ.2000 చొప్పున అపరాధ రుసుం విధించారు.

తర్వాత వారిని వదిలేయడంతో ఇసుక దొంగలు రెచ్చిపోతున్నారు. ప్రతి రోజూ సాయంత్రమైతే పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను ఒడిశాకు తరలిస్తున్నారు. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

అడ్డుకుంటాం..

గతంలో ఇదేవిధంగా చేస్తే ఒడిశా బోర్డర్ వద్ద మా సిబ్బందితో కలిసి పరిశీలన చేయించాం. ఇసుక తరలిస్తున్న వారిని వీఆర్వోలు అడ్డుకున్నా ఆపకుండా వెళ్లిపోయారు. ఇప్పుడు రాత్రివేళల్లో, సెలవురోజుల్లో తరలిస్తున్నట్లు తెలిసింది. పోలీసుల సాయంతో అడ్డుకుంటాం..

– పాపారావు, మెళియాపుట్టి తహసీల్దార్

కట్టడి చేస్తాం..

ఇదివరకే మహేంద్రతనయ నదీ తీరంలో నిఘా పెట్టాం. మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా మావంతు చర్యలు తీసుకుంటున్నాం.

– రమేష్ బాబు, మెళియాపుట్టి ఎస్సై

నాపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదు

- బీజేపీ రాయగడ జిల్లా అధ్యక్షుడు గోపి ఆనంద్



మాట్లాడుతున్న గోపి ఆనంద్ పక్కనే ఉలక, గొమాంగో తదితరులు

రాయగడ: తనపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని, కావాలనే బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ రాయగడ జిల్లా అధ్యక్షుడు గోపి ఆనంద్ స్పష్టం చేశారు. స్థానిక సిరిగుడలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అదనపు కలెక్టర్ నిహారి రంజన్ కుహరోపై దురుసుగా ప్రవర్తించానని వచ్చిన ఆరోపణలు అవాస్తవాలు అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ఏడీఎంను కలిసి చర్చించిన మాట వాస్తవేమేనని, అయితే ఆ సమయంలో దురుసుగా ప్రవర్తించలేదన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి వివరాలను ఒక అధికారిని అడగడం తప్పా అని ప్రశ్నించారు. అలాగే వ్యాపారవేత్తలు, విద్యాసంస్థ యజమానుల వద్ద ఉగాది పేరిట చందాలు దౌర్జన్యంగా వసూళ్లు చేస్తున్నారన్న వచ్చినవి నిరాధార ఆరోపణలుగా కొట్టిపారేశారు. మిల్లర్స్ అసోసియేషన్, జ్యూయలరీ షాప్ యజమానులను బెదిరించినట్లు వచ్చిన వార్తలు కేవలం పుకార్లు మాత్రమేనన్నారు. తమపై ఎటువంటి ఒత్తిడి తీసుకొని రాలేదని స్వయాన ఆయా సంస్థలకు చెందినవారు తనకు లిఖిత పూర్వకంగా రాసిచ్చారని వివరించారు. సమావేశంలో ఆయనతో పాటు బీజేపీ నాయకులు బసంత కుమార్ ఉలక, త్రినాథ్ గొమాంగో, జగన్నాథ నుంద్రుకలు పాల్గొన్నారు.

కదంతొక్కిన ఆదివాసీలు



ర్యాలీలో పాల్గొన్న ఆదివాసీ సంఘాలు



ర్యాలీలో పాల్గొన్న మహిళలు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆదివాసీ నేతలు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఎంవీ 72 గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఇద్దరి బాలికల కుటుంబాలకు న్యాయం జరగాలని ఆదివాసీలు కోరారు. ఈ మేరకు స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద ఆదివాసీ సంఘ నేత శరత్ బురద ఆధ్వర్యంలో జిల్లా ఆదివాసీ సంఘాలు మంగళవారం ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇద్దరి బాలికలు ఆత్మహత్య చేసుకోలేదన్నారు. వారిపై లైంగిక దాడి చేసి, హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. పోస్టుమార్టం రిపోర్టులో బాలికలు ఊపిరాడక మృతి చెందినట్లు నివేదిక వచ్చిందన్నారు. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరగకపోతే జాతీయ స్థాయిలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఆదివాసీ నాయకులు బందు ముదిలి, రవీంద్రనాథ్ బురదా, లలిత్ నారాయణ్ మడ్కమి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రణస్థలం: మండలంలోని బంటుపల్లి రాధాగోవింద మందిరం సమీపంలో జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఎస్పీ రమణ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళుతున్న లారీని వెనుక నుంచి ద్విచక్రవాహనంతో వచ్చిన రమణ బలంగా ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన రమణను 108 అంబులెన్సులో శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉంది. కొవ్వాడ గ్రామానికి చెందిన రమణ పైడిభీమవరం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ ఘటనపై ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందరికీ అందని అధనం



వంశధార నిర్వాసితుల కోసం నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఇదే

- వంశధార నిర్వాసిత కాలనీకి భూములిచ్చిన రైతులకు తప్పని ఎదురుచూపులు
- అధికారుల నిర్వాకం కారణంగా అదనపు పరిహారానికి నోచుకోని వైనం
- న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధిత రైతులు

ఆమదాలవలస రూరల్: కొంతమంది అధికారుల నిర్లక్ష్యం.. భూములు అందజేసిన రైతుల పాలిట శాపంగా మారింది. తమ తోటి రైతులు అదనపు పరిహారం అందుకున్నా తమకు మాత్రం అందకపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై కార్యాలయాలు, అధికారుల చుట్టూ ఎన్నిసార్లు ప్రదక్షిణాలు చేస్తున్నా కాలయాపన చేస్తున్నారు తప్ప న్యాయం చేయడం లేదని వాపోతున్నారు. తరతరాలుగా పచ్చని పంటలు పండించే భూములు ఎంతో ఉదారతమైన ఆశయంతో ప్రభుత్వానికి అప్పగిస్తే తమకు ఇలా చేస్తారా అంటూ మండిపడుతున్నారు. వంశధార రెండో దశ నిర్వాశితుల కాలనీ కోసం భూములు అందించిన పలువురు రైతులకు అదనపు పరిహారం అందక కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

హిరమండలం రిజర్వాయర్ కోసం తులగాం గ్రామంలో సర్వం కోల్పోయిన బాధితుల కోసం ప్రభుత్వం ఇళ్లు నిర్మించేందుకు ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస గ్రామంలో సంగమేశ్వర ఆలయం వద్ద సుమారు 115 ఏకరాలు భూమిని గుర్తించారు. ఇందులో రైతుల వద్ద నుంచి సుమారు 100 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఒక్కో బాధిత కుటుంబానికి ఐదు సెంట్ల స్థలంలో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఈ కాలనీ కోసం భూములు ఇచ్చిన రైతులకు రూ.5,25,000 పరిహారం కింద 2009లో అప్పటి ప్రభుత్వం అందజేసింది. అయితే ఈ పరిహారం ఏ మాత్రం చాలకపోవటంతో 2022లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎకరాకి రూ.1,00,000 చొప్పున అదనపు పరిహారం అందించాలని నిర్ణయించారు.దీ మేరకు రైతుల ఖాతాల్లో జమ చేశారు.

అధికారుల నిర్వాకం..

అధికారులు చేసిన తప్పులు కారణంగా సుమారు 30 మంది బాధిత రైతులు అదనపు పరిహారానికి నోచుకోలేకపోయారు. రెవెన్యూ శాఖ నుంచి భూసేకరణ శాఖకు పంపాల్సిన బాధితుల జాబితాలో బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఐ.ఎఫ్.ఎస్‌సి.కోడ్, ఆధార్ నంబర్ వంటివి తప్పుగా నమోదు చేయటంతో బాధితులకు ఇంతవరకు అదనపు పరిహారం అందని ద్రాక్షగానే మిగులుతోంది. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు న్యాయం జరగలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

న్యాయం చేస్తాం..

ఈ విషయమై ఆమదాలవలస తహశీల్దార్ ఎం.రాంబాబు వద్ద 'సాక్షి' ప్రస్తావించగా.. అదనపు పరిహారం విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. బాధితులకు తగిన న్యాయం చేస్తామని చెప్పారు.

ఫిర్యాదు చేసినా..



అదనపు పరిహారం అందలేదని కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేశాం. ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా అదనపు పరిహారం అందలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించిన అదనపు పరిహారం అందించి న్యాయం చేయాలి. – చింతాడ దమయంతి, శ్రీహరిపురం, ఆమదాలవలస మండలం

రాజకీయ కారణాలతోనే..



కొందరు అధికారులు, సిబ్బంది తీరు కారణంగా ఇంతవరకు పరిహారం అందలేదు. రాజకీయ కారణాలతోనే జాప్యం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా పరిహారం అందలేదు. – పొలం శ్రీనివాసరావు, గాజులకొల్లివలస, ఆమదాలవలస మండలం

అన్యాయం..



నిర్వాసిత కాలనీకి భూములు అందజేసిన బాధితులకు అదనపు పరిహారం ప్రకటించినా రెవెన్యూ సిబ్బంది వివరాలు తప్పుగా నమోదు చేయటం వల్ల ఇంతవరకు పరిహారం అందలేదు. భూములు కోల్పోయి రోడ్డున పడ్డ బాధితులను ఇప్పటికైనా ఆదుకోవాలి. – లంక అప్పలరాజు, గాజులకొల్లివలస, ఆమదాలవలస మండలం

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



వనంగుడిలో పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడిలో కొలువైన అమ్మవారికి సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా పూజాధికాలు జరిపారు. రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో అర్చకులు నేతేటి ప్రశాంత్ అమ్మవారిని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధనలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జి ఈఓ కేఎస్‌వీడీవీ ప్రసాద్ పర్యవేక్షించారు.

రాజీపేట పరిసర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు



రాజీపేట పరిసర ప్రాంతాల్లో ఉన్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని చింతలబెలగాం పంచాయతీ రాజీపేట పరిసర ప్రాంతాల్లోని పంట పొలాల్లో ఏనుగులు మంగళవారం దర్శనమిచ్చాయి. ఉదయం వెంకటరాజపురంలోని వరిపంటను ధ్వంసం చేసి సాయంత్రానికి వెంకటరాజపురం, బాసంగి మీదుగా చింతలబెలగాం, రాజీపేట గ్రామంలోకి జారుకున్నాయి. రాత్రి సమయమంలో గ్రామంలోకి చొచ్చుకు రావడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. వరిపంట, అరటి ఉండడంతో పంటలను ధ్వంసం చేస్తే పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగుచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థినికి డీఈఓ అభినందనలు



విద్యార్థినిని అభినందిస్తున్న డీఈఓ

పాచిపెంట: లక్నోలో ఇటీవల జరిగిన 1500 మీటర్లు, 3వేల మీటర్ల పరుగుపందెంలో పాచిపెంట మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని జోత్స్న పాల్గొంది. అండర్ 17 విభాగంలో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థినిని డీఈఓ నాయుడు మంగళవారం అభినందించారు. విద్యార్థినికి పాఠశాల హెచ్ఎం ఈశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు అభినందనలు తెలిపారు.

మహిళ మృతిపై కేసు నమోదు

రాజాం సిటీ: పట్టణ పరిధి మల్లికార్జునకాలనీ 7వ లైన్‌లో నివాసం ఉంటున్న కెల్ల లక్ష్మి (44) మృతిచెందడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. వీధిలో దుర్వాసన రావడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రెవెన్యూ సిబ్బంది సహాయంతో ఇంటి తలుపులు తీయగా ఇంటిలోపల ఆమె మృతదేహం కనిపించిందని ఎస్సై తెలిపారు. మూడు రోజుల క్రితమే ఆమె మృతిచెంది ఉంటుందని, ఇంట్లో ఒక్కతే ఉండేదని, ఆమె కుమారుడు దుర్గాప్రసాద్ విశాఖపట్నంలో ఉంటున్నాడని చెప్పారు. ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సామాజిక, ఆర్థిక సర్వేల ఆధారంగా ప్రణాళికలు

కొత్తవలస: జాతీయ శాంపిల్ సర్వే నిర్వహించే సామాజిక, ఆర్థిక సర్వేల ఆధారంగా ప్రణాళికలు రూపకల్పన చేస్తామని ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.రాజశేఖర్ తెలిపారు. మండలంలోని కంటకాపల్లి గ్రామంలో జాతీయ శాంపిల్ సర్వే వజ్రోత్సవాల నిర్వహణలో భాగంగా 2025 జనవరి నుంచి అక్టోబర్ వరకు జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సర్వే చేస్తామన్నారు. గృహ వినియోగ, ఉద్యోగిత-నిరుద్యోగిత రేటు, సమయ వినియోగం, పంట దిగుబడి, సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల సర్వేలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ గణాంకాధికారులు ఎస్.పళ్లంరాజు, ఎస్.వెంకటేశ్వరరావు, కె.వి.సురేష్‌కుమార్, బి.శ్రీనివాసరావు, టి.వేణుగోపాల్, ఆర్.శ్రీనివాసరావు, తహసీల్దార్ బి.నీలకంతరావు, ఎంపీడీఓ ఎస్.రమణయ్య, సహాయ గణాంకాధికారి వారణాసి సన్యాసిరావు, గ్రామ పెద్దలు మదీన అప్పలరమణ పాల్గొన్నారు.

ఎవరి లాభం కోసం..!

- అంతా అయిపోయాక కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- రైతులు ఇప్పటికే విక్రయించేసిన పెసలు, మినుములు
- ప్రభుత్వ మద్దతు ధర క్వింటా పెసలు రూ.8682
- మినుములు రూ.7400
- తక్కువ ధరకే వ్యాపారులకు అమ్మేసుకున్న రైతులు



గంట్యాడ రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన అపరాల కొనుగోలు కేంద్రం

విజయనగరం ఫోర్ట్: అల్లుడు వచ్చేంతకు వరకు అమావాస్య ఆగదన్న చందాన తయారైంది ప్రభుత్వం తీరు. రైతులు పండిన పంటను విక్రయించుకున్న తర్వాత కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యాపారులకు మేలు చేయడానికి ఇప్పుడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రబీలో రైతులు సాగు చేసిన అపరాలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పుడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వారం రోజులవుతున్నా ఇంతవరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



విజయనగరం మండలం పినవేమలిలో సాగులో ఉన్న పెసరపంట (ఫైల్)

జిల్లాలో ఐదు కేంద్రాలు

జిల్లాలోని గంట్యాడ, బొబ్బిలి, జామి మండలంలో విజినిగిరి, సంతకవిటి, గజపతినగరంలో అపరాల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. విజినిగిరి కేంద్రంలో కేవలం 15 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మిగతా నాలుగు కేంద్రాలకు ఒక్కరు కూడా రాలేదు. ఈనెల 19వతేదీన అపరాల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేసింది లేదని తెలిసింది.

కొనుగోలు కేంద్రాల జాప్యంతో తక్కువధరకే విక్రయం

అపరాలు (పెసర, మినుము) పంటల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటులో జాప్యం వల్ల రైతులు తాము పండించిన పెసర, మినుములను తక్కువ ధరకే విక్రయించేశారు. ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు పెసలు రూ.8,682, మినుములు రూ.7,400. అయితే అధిక శాతం మంది ఫిబ్రవరి నెలలోనే వ్యాపారులకు విక్రయించారు. కొనుగోలు కేంద్రాలు అలస్యం అవడంతో పెసలు క్వింటా రూ.6,500, మినుములు క్వింటా రూ.6వేలు చొప్పన రైతులు అమ్ముకున్నారు. క్వింటాకు రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు రైతులు నష్టపోయారు.

6116 హెక్టార్లలో పెసర సాగు

జిల్లాలో పెసర పంట 6116 హెక్టార్లలో సాగైంది. 3792 మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వచ్చింది. అదేవిధంగా మినుము పంట 16,523 హెక్టార్లలో సాగైంది. 10,409 మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వచ్చింది.

అధిక వర్షాలతో చాలావరకు నష్టం

జిల్లాలో గత ఏడాది డిసెంబర్ నెలలో కురిసిన వర్షాలు వల్ల పెసర, మినుము పంటలు చాలా వరకు దెబ్బతిన్నాయి. దీని వల్ల దిగుబడి కూడా చాలా వరకు తగ్గింది. వచ్చిన కొద్దిపాటి పంటకు కూడ మద్దతు ధర రాని పరిస్థితి. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలు వ్యాపారుల కోసమేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి నెలలోనే రైతులు పెసర, మినుము పంటలు విక్రయించేశారు. వాటిని వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేశారు. ఇప్పుడు వాటిని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు వ్యాపారులు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విజినిగిరలో 15 మంది రిజిస్ట్రేషన్

జిల్లాలో ఐదు చోట్ల అపరాల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. విజినిగిరి కొనుగోలు కేంద్రంలో 15 మంది అపరాలు విక్రయించడానికి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మిగిలిన నాలుగు చోట్ల ఇంకా ఎవరూ రాలేదు.

ఎస్.వెంకటేశ్వరావు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్

డ్రోన్ దెబ్బ.. పేకాటరాయుళ్ల అబ్బా..!



హుకుంపేటలో పేకాట ఆడుతున్న వారిని గుర్తించిన డ్రోన్

విజయనగరం క్రైమ్: జిల్లాలో డ్రోన్స్ సహాయంతో పేకాట, కోడి పందాలకు పోలీసులు చెక్ పెడుతున్నారు. విజయనగరంలోని హుకుంపేట శివారు, పూసపాటిరేగ మండలం వెంపడాం వద్ద మంగళవారం పోలీసులు డ్రోన్స్ ఉపయోగించి పేకాట ఆడుతున్న, కోడి పందాలు నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు వచ్చిన కచ్చితమైన సమాచారంతో విజయనగరం టూటౌన్ సీఐ టి.శ్రీనివాసరావు సిబ్బంది హుకుంపేట శివారులో పార్కింగ్ చేసిన లారీలో పేకాట ఆడుతున్న వారిపైకి డ్రోన్‌ను వంపి, శివారు ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు నిర్ధారించుకుని, రైడ్ చేసి పారిపోతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.12,600 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

కోడి పందాల శిబిరంపై దాడి

అలాగే జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉన్న పూసపాటిరేగ మండలం వెంపడాం గ్రామ శివారులో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పోలీసులకు వచ్చిన సమాచారంతో వారిపైకి డ్రోన్ పంపి, సుదూర ప్రాంతంలో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు నిర్ధారించుకుని భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, పూసపాటిరేగ ఎస్సై దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్‌సిబ్బంది రైడ్ చేసి, కోడి పందాలు ఆడుతూ, పారిపోతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15,600 నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. నేర నియంత్రణలోను, శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు డ్రోన్స్‌ను వినియోగిస్తున్నామని, పట్టణ, గ్రామ శివారు ప్రాంతాలపై డ్రోన్స్ సహాయంతో నిఘా పెడుతున్నామని ఎస్పీ ఈ సందర్భంగా చెప్పారు.

తరలిపోతున్న వృక్ష సంపద..!

- పట్టించుకోని రెవెన్యూ, అటవీశాఖ అధికారులు



రాత్రివేళ ట్రాక్టర్ల సహాయంతో తరలిస్తున్న టేకుకలప



నాటుబళ్ల సాయంతో తరలించేందుకు సిద్ధంగా ఉన్న టేకు కలప

కొమరాడ: మండలం నుంచి వేలాది రూపాయల విలువ చేసే అటవీ సంపద రాత్రివేళ నాటుబళ్లు, ట్రాక్టర్‌ల సహాయంతో తరలిపోతోంది. పట్టించుకోవాల్సిన రెవెన్యూ, అటవీశాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా వృక్ష సంపద నరికి వేస్తుండడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. ఒడిశా సరిహద్దు నుంచి టేకు కలప చడీచప్పుడు లేకుండా రవాణా సాగిస్తున్నారు. ఈ వ్యవహారంలో కొంతమంది అక్రమ వ్యాపారులు, రెవెన్యూ సిబ్బంది కుమ్మక్కైనట్లు తెలుస్తోంది. టేకుకలప తరలించాలంటే కచ్చితంగా రెవెన్యూ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. కొమరాడ మండలం నుంచి పార్వతీపురం సా మిల్లులకు తరలించిన తరువాత అక్కడినుంచే సంబంధిత శాఖ అధికారులకు మామూళ్లు వెళ్తాయని సమాచారం. దీనికి సంబంధించి ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పరీక్షలంటే భయాన్ని వీడండి

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ



విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్, ఇన్‌చార్జ్ ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

సాలూరు: విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని విడనాడాలని సబ్‌కలెక్టర్, ఇన్‌చార్జ్ ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పాచిపెంట మండలంలోని పి.కోనవలస గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని రుచి చూసి మెనూ పరిశీలించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షలు ఏ విధంగా రాస్తున్నారు? ఏ విధమైన ప్రణాళిక ద్వారా చదువుతున్నారు? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు లక్ష్యంతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. పరీక్షల్లో ప్రణాళికా బద్ధంగా చదవడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వయోశ్రేష్టుల సంరక్షణ చట్టాన్ని అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వయోశ్రేష్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంపరాల నారాయణమూర్తి

విజయనగరం టౌన్: వయోశ్రేష్టుల సంరక్షణ చట్టాన్ని ప్రతి జిల్లాలో కచ్చితంగా అమలుచేయాలని ఆలిండియా సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్, రాష్ట్ర వయోశ్రేష్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంపరాల నారాయణమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో వయోశ్రేష్టుల రాష్ట్ర కార్యవర్గ కౌన్సిల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సబ్‌డివిజనల్ స్థాయిలో ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి రెవెన్యూ సబ్ డివిజన్ స్థాయిలో వచ్చే సమస్యలను పరిష్కరించాలని, కలెక్టర్ స్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటుచేసి జిల్లా స్థాయిలో వచ్చే వయోశ్రేష్టుల సమస్యలను 90 రోజుల్లో పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి జిల్లాలోనూ కమిటీలు వేసి మూడు నెలలకొకసారి కమిటీ సమావేశం నిర్వహించి వయోశ్రేష్టుల సంక్షేమంపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వయోశ్రేష్టుల శేషజీవితం ఆధ్యాత్మికంగా, ఆరోగ్యంగా, ఆర్థికంగా సమృద్ధిగా ఉండేలా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కట్టమూరి చంద్రశేఖర్ ప్రార్థన గీతంతో ప్రారంభమైన సమావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పరమేశ్వర రెడ్డి, కార్యదర్శి రామచంద్రరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, సత్యనారాయణమూర్తి, వెంకటరమణ, తదితరులు దివంగత కేపీ ఈశ్వర్ మృతిపట్ల మౌనం పాటించారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.ఎస్.కుప్పూరావు, ప్రతినిధులు త్రినాథప్రసాద్, బసవమూర్తి, జగన్నాథరావు, గిడుతూరి పైడితల్లి, అధిక సంఖ్యలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణుల పట్ల అప్రమత్తం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

భామిని: ఆస్పత్రి ప్రసవాలకు ప్రాధాన్యం ఇచ్చి, హైరిస్క్ గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ భాస్కరరావు సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన భామిని మండలంలోని బత్తిలి, భామిని, బాలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. బత్తిలి పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న న్యూట్రీ-గార్డెన్‌ను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రులకు వస్తున్న రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. భామిని పీహెచ్‌సీలో మందుల నిల్వలు పరిశీలించి, ల్యాబ్‌లో చేస్తున్న పరీక్షలను గుర్తించారు. బాలేరు పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది హాజరు పట్టీ పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ వెంట బత్తిలి డాక్టర్లు రవీంద్ర, దామోదరరావు, భామిని వైద్యులు సోయల్, సంతోషిలక్ష్మి, బాలేరు వైద్యాధికారి శివకుమార్, సీహెచ్‌ఓ భాస్కరరావు పాల్గొన్నారు.

ఇరుగ్రామాల యాదవుల కొట్లాట

- ఆరుగురికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం





క్షతగాత్రులు ఈశ్వరరావు, లక్షుంనాయుడు

బాడంగి: గొర్రెల మేత విషయంలో ఇరుగ్రామాలకుచెందిన యాదవులు కొట్లాటకు దిగడంతో ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం మండలంలో జరగ్గా గాయపడిన వారి బంధువులు తెలిపిన సమాచారం ఇలా ఉంది. మండలంలోని గొల్లాది, కామన్నవలస గ్రామాలకుచెందిన యాదవులు గొడవపడి కర్రలతో కొట్టుకోగా కామన్నవలసకు చెందిన పడాల లక్షుం, కామేశ్వరరావు, సింహాచలం, ఆదినారాయణలు, గొల్లాదికి చెందిన ఈపు ఈశ్వరరావు, చప్పసత్యం గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ముగ్గురిని 108లో స్థానిక ఆస్పత్రికి తీసుకురాగా ప్రథమచికిత్స చేసిన డాక్టర్ హారిక వారిలో ఈపు ఈశ్వరరావు, పడాల లక్షుంల పరిస్థితి విషమించడంతో విజయనగరం ఆస్పత్రికి తరలించాలని సూచించారు. ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు క్షతగాత్రుల బంధువుల నుంచి ఫిర్యాదు తీసుకుని పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్‌పై నుంచి పడి రిటైర్డ్ హెచ్‌ఎం మృతి



సంఘటనా స్థలంలో శ్యామ్ సుందర్ మృతదేహం,(ఇన్‌సెట్లో) శ్యామ్ సుందర్ (ఫైల్)

బొబ్బిలి: పట్టణంలోని నాయుడు కాలనీలో గల ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న రిటైర్డ్ హెచ్ఎం వై.శ్యామ్‌సుందర్(80) రెండో అంతస్తు నుంచి పడిపోయి మంగళవారం మృతిచెందారు. బాడంగి మండలం పాల్తేరులో హెచ్‌ఎంగా రిటైరైన ఆయన బొబ్బిలిలోని ప్రముఖ వైద్యుడు, ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ వై.విజయమోహన్ తండ్రి. మంగళవారం మేడపై ఉన్న ఆయన ఆకస్మాత్తుగా కళ్లు తిరిగి కిందికి పడిపోయినట్లు, అల్జీమర్స్‌తో కొద్దికాలంగా బాధపడుతున్నట్లు కోడలు గ్రేస్‌కుమారిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామని ఎస్సై ఆర్.రమేష్ కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించామని ఎస్సై చెప్పారు.

ఆలివ్‌రిడ్లే తాబేళ్లను కాపాడడం మనందరి బాధ్యత

- డీఎఫ్‌ఓ కొండలరావు



పులిగెడ్డపేట సమీపంలో సుముద్రంలోకి విడిచి పెడుతున్న ఆలివ్‌రిడ్లే తాబేళ్లు

పూసపాటిరేగ: సముద్రంలో నివసించే ఆలివ్‌రిడ్లే తాబేళ్లను కాపాడడం మనందరి బాధ్యతని డీఎఫ్‌ఓ కొండలరావు అన్నారు. పూసపాటిరేగ మండలం పులిగెడ్డపేట తీరంలో 270 ఆలివ్‌రిడ్లే తాబేళ్ల పిల్లలను సముద్రంలో విడిచిపెట్టా రు. ట్రీ ఫౌండేషన్, అటవీశాఖ ఆధ్వర్యంలో 10 రక్షణ కేంద్రాల్లో 517 తాబేళ్ల ద్వారా 56,065 గుడ్లను సంరక్షించినట్టు తెలిపారు. టేకు వలలు, నానాజాతి వలలను మత్స్యకారు లు చేపల వేటకు వినియోగించడంతో ఆలివ్‌రిడ్లేలకు ముప్పువాటిల్లుతోందన్నారు. సముద్ర తాబేళ్లను కాపాడడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు మత్స్యసంపద అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ అధికారి అప్పలరాజు, ఫారెస్టు సెక్షన్ అధికారి మధుమోహన్, ట్రీ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ కామయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పతిదారుల సంఘాలకు నాబార్డు చేయూత

నెల్లిమర్ల రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో నాబార్డు నుంచి ఆర్థిక సహాయం అందజేస్తామని జిల్లా మేనేజర్ నాగార్జున తెలిపారు. మండలంలోని సతివాడ గ్రామంలో శుభోదయం రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులతో మంగళవారం సమావేశమయ్యా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు గోదాముల ఏర్పాటు, డ్రోన్ మిషన్లు, యాంత్రీకరణ పనిముట్లు కొనుగోలు కు సాయం అందజేస్తామన్నారు. రైతులంతా ఒకే మాటపై ఉండి సంఘ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఇండియా మార్కెటింగ్ జోనల్ ఇన్‌చార్జి గోపాల్‌కృష్ణ గోఖలే, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, బీఆర్‌ఈడీఎస్ సీఈఓ రామకృష్ణరాజు, సీఈఓ పతివాడ సత్యనారాయణ, సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, నాయకులు జమ్ము అప్పలనాయుడు, పంచాది శ్రీరాములనాయుడు, దురగాశి ఎర్రంనాయుడు, మత్స శ్రీనివాసరావు, కంది శ్రీను, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిస్ మేళా రేపు

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 27న హైదరాబాద్‌కు చెందిన టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, బొబ్బిలిలోని పటాల్ రెయిల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రై.లిమిటెడ్ కంపెనీలు అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్, వెల్డర్ ట్రేడులలో ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు హాజరుకావచ్చన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆరోజు ఉదయం 9 గంటలకు టెన్త్ మార్క్సులిస్ట్, ఐటీఐ మార్క్స్ లిస్ట్, ఆధార్, కుల ధ్రువీకరణ, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. బయోడేటా, ఫొటోలను జతపర్చి నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన ఎర్నాయుడు

గంట్యాడ: మండలంలోని కొర్లాం గ్రామానికి చెందిన లగుడు ఎర్నాయుడు సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తామరాపల్లి నుంచి గంట్యాడ వైపు వెళ్తున్న బొలెరో వాహనం కొర్లాం జంక్షన్ వద్దకు వచ్చేసరికి సైకిల్‌పై వెళ్తున్న ఎర్నాయుడిని ఢీకొట్టడంతో కింద పడిపోగా తలకు తీవ్రగాయాల య్యాయి. దీంతో స్థానికులు 108 అంబులెన్సులో విజ యనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు.

ఎక్స్‌రే మిషన్ ప్రారంభం



డీఆర్ ఎక్స్‌రే మిషన్‌తో రోగికి ఎక్స్‌రే తీస్తున్న రేడియోగ్రాఫర్

సాక్షి ఎఫెక్ట్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి కోసం కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన ఆధునాతన ఎక్స్‌రే మిషన్‌ను వినియోగంలోకి తేకుండా వదిలేశారు. ఈ అంశంపై సాక్షిలో ఈనెల 20వతేదీన 'కోటి యంత్రం గదికే పరిమితం' శీర్షికన ప్రచురించిన కథనంపై ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వైద్యాధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం డీఆర్ ఎక్స్‌రే మిషన్‌ను సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు ప్రారంభించారు. అనంతరం రోగులకు ఎక్స్‌రేలు తీయడం మొదలుపెట్టారు.



డీఆర్ ఎక్స్‌రే మిషన్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు